## రికార్డులు తిరగరాస్తున్న పీ4-
## 13 లక్షల కుటుంబాల దత్తత-




# బలగం TV
BALAGAM

నిజమే బా బలం..ప్రజలే మా బలగం

## సోషల్ పోస్టులపై ఏపీ సర్కార్ కొరడా..!

త్వరలో చట్టం, నిజ నిర్ధారణ కమిటీ..!




BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం, 20 ఆగస్టు-2025 | balagamtv100@gmail.com | పేజీలు-4


# విదేశీ విద్యార్థులకు అమెరికా బిగ్ షాక్

### ఏకంగా 6 వేల వీసాల రద్దు..!



**హైదరాబాద్-ఆగస్టు 19(ది టైమ్స్ ఆఫ్ తెలంగాణ) :** అమెరికాలో రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వలసదారులతో పాటు విదేశీ విద్యార్థులపై ఉరుముతున్న డొనాల్డ్ ట్రంప్.. వారిని సాగనంపేందుకు ఏ చిన్న అవకాశం దొరికినా వదులుకోవడం లేదు. ఇప్పటికే కొత్తగా జారీ చేసే వీసాలు, గ్రీన్ కార్డులపై తీవ్రమైన ఆంక్షలు విధిస్తున్న ట్రంప్.. ప్రస్తుతం వీసాలు, గ్రీన్ కార్డులు కలిగిన వారిని కూడా వదలడం లేదు. ఇదే క్రమంలో తాజాగా భారీ ఎత్తున విదేశీ విద్యార్థులకు ట్రంప్ సర్కార్ షాకిచ్చింది. వీసా గడువు ముగిసినా అమెరికాలోనే ఉండిపోవడం, ఆ దేశ చట్టాల్ని ఉల్లంఘించడం, తీవ్రమైన నేరాలు, ఉగ్రవాద చర్యలకు పాల్పడటం వంటి కారణాలు చూపుతూ ట్రంప్ సర్కార్ ఏకంగా 6 వేల మంది విదేశీ విద్యార్థుల వీసాల్ని రద్దు చేసింది. ఇందులో మూడింటి రెండొంతుల మంది నేరుగా నేరాలు చేసిన వారే ఉన్నట్లు తేల్చారు. దీంతో ఈ నాలుగు వేల మంది వీసాలు రద్దయ్యాయి. తీవ్రవాదం, తీవ్రవాదానికి మద్దతు వంటి ఆరోపణలపై 200 నుంచి 300 అంతర్జాతీయ విద్యార్థి వీసాల్ని రద్దు చేశారు. అయితే ఇలా భారీ ఎత్తున అంతర్జాతీయ విద్యార్థి వీసాలు రద్దు చేసి వెనక్కి పంపుతున్నా.. వారంతా ఏయే దేశాల వారు అన్న వివరాలు మాత్రం ప్రభుత్వం బయటపెట్టడం లేదు. అలాగే ఇలా వీసాలు రద్దయిన వారు ఇంకా అమెరికాలో ఉన్నారా లేదా అన్న వివరాలు కూడా ఇవ్వడం లేదు. జాతీయ భద్రతా కోణంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ వీసాలు రద్దయినట్లు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే విద్యార్థి వీసాల దుర్వినియోగం కారణంగా వీటిని రద్దు చేయలేదని తెలుస్తోంది.

# కేంద్రానికి సుప్రీం మరో బిగ్ షాక్..!

### ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గబోం..!



**హైదరాబాద్-ఆగస్టు 19 :** రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల్ని గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించకుండా కాలయాపన చేయడాన్ని తప్పుబడుతూ ఇందుకు గడువుల్ని నిర్దేశించిన సుప్రీంకోర్టు.. తీవ్ర విమర్శలు, సుదీర్ఘ విచారణ తర్వాత కూడా ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గేందుకు నిరాకరించింది. ఈ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 12న రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల క్లియరెన్స్ పై ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టబోమని ఛీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల సుప్రీం బెంచ్ తేల్చిచెప్పేసింది. గతంలో తమిళనాడు అసెంబ్లీ ఆమోదించి పంపిన 10 బిల్లుల్ని క్లియర్ చేసేందుకు గవర్నర్ బీఎన్ రవి ఇష్టపడలేదు. దీంతో వాటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. దీన్ని సవాల్ చేస్తూ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ 10 బిల్లులు ఆటోమేటిగ్గా ఆమోదం పొందినట్లేనని ప్రకటించింది. దీంతో పాటు రాష్ట్రపతి, గవర్నర్లకు రాష్ట్రాలు పంపిన బిల్లుల్ని క్లియర్ చేసేందుకు గడువులు కూడా విధించింది. అయితే ఆ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం.. గతంలో ఇచ్చిన తీర్పును పక్కనబెట్టబోమని తేల్చిచెప్పేసింది. అయితే తమిళనాడు కేసులో అప్పీలును స్వీకరించబోమని, కానీ నిర్ణయం కాకుండా సూచన మాత్రమే చేస్తామని తెలిపింది. తాము సలహా పరిధిలో ఉన్నామని, అప్పిలేట్ పరిధిలో లేమని బెంచ్ లో ఒకరైన జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కోర్టు ఓ అభిప్రాయాన్ని వినవచ్చు కానీ తీర్పును తోసిపుచ్చదని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గతంలో లేవనెత్తిన 14 ప్రశ్నలకు తమిళనాడు కేసులో ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు ద్వారా సమాధానాలు లభించాయని రాష్ట్రం తరఫున హాజరైన లాయర్ అభిషేక్ సింఘ్వీ, కేరళ తరఫున హాజరైన మరో లాయర్ కేకే వేణుగోపాల్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఇప్పటికే ఇచ్చిన తీర్పును తిరిగి సమీక్షించడానికి రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద ఉన్న అధికారాన్ని వాడలేరని తెలిపారు. కానీ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇద్దరూ కోర్టు వాస్తవానికి ఆర్టికల్ 143 కేసుల్లో గత తీర్పుల్ని సమీక్షించవచ్చని, లేదా మార్చవచ్చని వాదించారు. చివరికి విచారణ రేపటికి వాయిదా పడింది.

## బుగ్గారంలో జిల్లా వైద్యాధికారుల ఆకస్మిక తనిఖీ

- పరిసరాలను పరిశీలించిన వైద్యాధికారులు
- సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన



**బుగ్గారం / జగిత్యాలజిల్లా:** జగిత్యాలజిల్లా బుగ్గారం మండల కేంద్రం లో జిల్లా వైద్యాధికారులు మంగళ వారం ఆకస్మిక తనిఖీ నిర్వహి ంచారు. బుగ్గారం కు చెందిన ఓ వ్యక్తి ఉపాధి నిమిత్తం గత కొంత కాలంగా ధర్మపురిలో ఉంటున్నాడు. అక్కడ ఆయనకు జ్వరం సోకి తగ్గడం లేదు. తీవ్ర జ్వరంతో బాధ పడుతున్న ఆవ్యక్తి జిల్లా ఏరియా ఆసుపత్రిలో, తర్వాత కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్సలు చేయించు కుంటున్నారని తెలిసింది. విషయం తెలుసుకున్న జిల్లా ఉప వైద్యా ధికారి ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది బుగ్గారంలో కూడా మంగళ వారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. బుగ్గారంలోని పలు ప్రాంతాలలో వారు స్వయంగా వెళ్ళి పరిసరాలను పరిశీలించారు. ఇండ్లలోని వివిధ పాత్ర ల్లో, పాత కుండల్లో, కూలర్లలో నిలువ ఉన్న నీటిని, లార్వాలను తొల గించారు. పరిసరాలను పరిశుభ్రం చేయించి ఆయిల్ బాల్స్ వేశారు. దోమలను చంపేందుకు, తరిమి కొట్టేందుకు మందులు పిచికారి చేయించారు. గ్రామస్తులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవగా హన కల్పించారు. వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి అక్బర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికు లతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో, బావు ల్లో బ్లీచింగ్ పౌడర్ వేశారు. దోమల సంహరణ కోసం రసాయనాలను స్ప్రే చేయిం చారు. జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్‌తో పాటు కమ్యూనిటీ వైద్యాధికారి అల్లెంకి శ్రీనివాస్, సూపర్వైజర్లు వెంకటేష్, శ్రీనివాస్, పంచాయతీ కార్య దర్శి అక్బర్, ఎం.ఎల్.హెచ్. పి. నరేష్, ఏఎన్ఎం లు శైలజ, స్వప్న, హెల్త్ అసిస్టెంట్ శోభన్, మహేంద్ర పాల్గొన్నారు.

## చెక్‌డ్యామ్ కట్టే తెలివిలేదు కాళేశ్వరంపై
# బురద జల్లుడు సిగ్గుచేటు

- కట్టిన రెండు నెలల్లోనే చెక్‌డ్యామ్ ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్




**హైదరాబాద్-ఆగస్టు 19(ది టైమ్స్ ఆఫ్ తెలంగాణ) :** 'కనీసం చెక్‌డ్యామ్ కట్టే తెలివి లేనోళ్లు కూడా కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం సిగ్గుచేటు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లోని అడ్డాకుల మండలం గుడిబండ పెద్ద వాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్‌డ్యామ్ రెండు నెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వడం చేతకాదు. సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగ్గా కట్టించే తెలివిలేదు. చివరికి ఓ చెక్ డ్యామ్‌ను కూడా నిర్మించలేని కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం సిగ్గుచేటు' అని మంగళవారం ఎక్స్‌వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. నాసిరకం పనులు చేసి రైతుల పొలాలు, మోటార్ పైప్‌లైన్లు, చివరికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా **(మొదటి పేజీ తరువాయి)..** కొట్టుకుపోయే దుస్థితికి కారణమైన ప్రతి ఒకరిపై సరారు చర్యలు తీసుకొని బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల మాట దేవుడెరుగు చివరికి ఒక ఇటుక కూడా సరిగ్గా పేర్చలేని ఈ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సరారు ముకు నేలకు రాసి మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టుపై నోరు పారేసుకోమని లెంపలేసుకోవాలని హితవుపలికారు. ఏ ఫొటోగ్రాఫర్ కూడా విషాద చిత్రాలు తీసేం దుకు ఇష్టపడరని, కానీ, రాష్ట్రంలో ప్రస్తుతం అవే చిత్రాలు వాస్తవంగా మారుతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా మంగళవారం ఆసక్తికర ట్వీట్ చేశారు. 'సాగునీళ్లు లేక ఎండిపోయిన పంటలను చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతన్నలు.. రుణమాఫీ ఎప్పుడవుతుందో తెలియక ఎదురుచూసి అలసిపోయిన అన్నదాతలు.. యూరియా కోసం రైతన్నలు కడుతున్న అంతులేని క్యూలు..ఓ వైపు ఇందిరమ్మ ఇండ్ల కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న ఆడబిడ్డలు.. మరోవైపు కండ్ల ముందే సొంతింటిని బుల్డోజర్లతో నేలమట్టం చేస్తుంటే తట్టుకోలేక గుండె పగిలేలా రోదిస్తున్న అభాగ్యుల ఆర్తనాదాలు.. హామీ ఇచ్చిన ఉద్యోగాలు ఎకడని నిలదీసిన యువత.. వారి వీపులపై విరుచుకుపడుతున్న లాఠీలు.. తెలంగాణకు కావాల్సింది ఇలాంటి హృదయ విదారక దృశ్యాలు కాదు.. సబ్బండవర్ణాల పురోగతి' అని పేర్కొన్నారు. బుల్డోజర్‌కు అడ్డంగా పడుకున్న మహిళ, కూల్చిన ఇంటి ఎదుట దీనంగా రోదిస్తున్న కుటుంబసభ్యులు, యూ రియా కోసం వానలో తడుస్తూ లై న్‌లో ఉన్న రైతుల ఫొటోలు పోస్టు చేశారు.

## రేపు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం..
## కేంద్రానికి కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు-19:** ఈ నెల 20న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రానికి బహిరంగ లేఖ రాశారు. జీఎస్టీ స్లాబ్ రద్దు లేదా మార్పు అంటూ కేంద్రం గత వారం రోజులుగా ప్రచారం చేసుకుంటుంది. వీటి ద్వారానే ప్రజల జీవితాల్లో నిజమైన దీపావళి వస్తుంది అంటూ ప్రాపగాండ చేస్తుంది. గత పుష్కరకాలంగా లక్షల కోట్ల రూపాయలు పెంచిన పెట్రోల్, డీజిల్, ఎల్పిజి రేట్ల రూపంలో ప్రజల నుంచి దోచుకుంది. ఒక వైపు ప్రతి నెల వేలాది రూపాయాలు పెట్రోల్, ఎల్పిజి, డీజిల్ రూపంలో భారం మోపుతూ.. జిఎస్టి స్లాబ్ మార్పు వలన కేవలం పదుల రూపాయల భారం తగ్గిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ధరల తగ్గింపుపైన చిత్తశుద్ధి ఉంటే.. దానికి ప్రాథమిక కారణమైన పెట్రో ధరలను తగ్గించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ తగ్గితే రవాణా భారం తగ్గి.. దాదాపు అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయి. పెట్రోల్, డీజిల్, ఎల్పిజిపైన పన్నులు తగ్గించి.. సెస్సులను పూర్తిగా ఎత్తివేసి మీ చిత్తశుద్ధి నిరూపించుకోండి. లేకుంటే మీ మాటలు మరొక జుమ్లాలాగా మిగిలిపోతాయి. చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేపటి జీఎస్టీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా కొన్ని కీలకమైన ప్రజా సమస్యలను మీ దృష్టికి తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. గతంలో తెలంగాణ రాష్ట్ర మంత్రిగా, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రజల పక్షాన మా వాదనను వినిపించడం మా కర్తవ్యంగా భావిస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణలో అప్పటి దాకా వానలే..

- ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ..!



**హైదరాబాద్, ఆగస్టు-19:** వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజులు భారీ వర్షాలు కొనసాగు తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ ఒడిశా తీరంలో ఏర్పడిన వాయుగుండం పశ్చి, వాయువ్య దిశగా కదిలి భవానీ పట్నానికి 50 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని.. దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ రాబోయే 12గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపింది. మంగళశారం ఆసిఫాబాద్ జిల్లాల్లో అత్యం త భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాల పల్లి, ములుగు, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూ బాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మ కొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది.

# కొనుగోలుదారులకు బిగ్ రిలీఫ్.. తగ్గిన పసిడి ధరలు..!

**హైదరాబాద్, ఆగస్టు-19:** బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. విదేశీ మార్కెట్లలో బలమైన ట్రెండ్ మధ్య ధరలు తగ్గుముఖం పట్టాయి. 24 క్యారెట్ల గోల్డ్‌పై రూ.500 తగ్గి తులానికి రూ.1,00,420కి చేరుకుంది. 22 క్యారెట్స్ ధర రూ.450 తగ్గి రూ.1,00,050కి పతనమైంది. అలాగే, వెండి ధర సైతం దిగివ చ్చింది. రూ.1000 తగ్గి కిలో ధర.. రూ.1,14,000కి చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మధ్య వైట్ హౌస్‌లో జరిగిన శాంతి చర్చలు ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే ఆశను రేకెత్తించాయని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. సమావేశంలో యూరోపియన్, నాటో నాయకులు పాల్గొన్నారు. భారత ప్రభుత్వం జీఎస్టీ నిబంధనల్లో మార్పుల కారణంగా డాలర్, రూపాయి బలహీనపడడం దేశీయ బంగారం ధరలపై ప్రభావం చూపుతోందని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ అండ్ కరెన్సీల అధిపతి ప్రవీణ్ సింగ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో న్యూయార్క్‌లో స్పాట్ బంగారం 0.15 శాతం పెరిగి ఔన్స్‌కు 3,337.92 డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో స్పాట్ వెండి 0.19 శాతం పెరిగి ఔన్స్‌కు 38.09 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. జాక్సన్ హోల్‌లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం, ఫెడ్ ఇటీవలి సమావేశం వివరాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించడంతో బంగారం ధరలు ఔన్స్‌కు 3,380 కంటే తక్కువగా పడిపోయాయని ఫెడ్ చైర్మన్ ఆగ్‌మాంట్ పరిశోధనా అధిపతి రెనిషా చైనాని తెలిపారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం రూ.1,00,750 ఉండగా.. 22 క్యారెట్ల పసిడి రూ.92,350 వద్ద ట్రేడవుతున్నది. ఇక వెండి కిలోకు రూ.1.26లక్షలు పలుకుతున్నది.



balagamtv100@gmail.com

# ప్రస్తుతం యువత మైండ్ సెట్ మారాలి : డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



హనుమకొండ, ఆగస్టు19 : ప్రస్తుతం యువత మైండ్ సెట్ మారాల్సిన అవసరం ఉందని, నా ఆవిష్కరణ ఈ దేశానికి ఉపయోగపడేలా ఉండాలనే మైండ్ సెట్ రావాలి.. ప్రపంచ సాంకేతికతతో పోటీపడే మనస్తత్వం, ఆవిష్కరణలో కొత్తదనం, ఏఐ, ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం టెక్నాలజీ లాంటి ఏరియాలు అధ్యయనం, పరిశోధనకు యువతలో రావాలని డీఆర్డీవో పూర్వపు చైర్మన్ భారత ప్రభుత్వ మినిస్ట్రీ అఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు.కాకతీయ యూనివర్సిటీ సెనెట్‌హాల్‌లో 'తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్' అట్టహా సంగా ప్రారంభమైంది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సతీష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 'ఇన్నోవేటివ్ స్కిల్స్‌ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్‌అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ యంగ్ ఇండియా' థీమ్‌తో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు, యువత నూతన ఆవిష్కరణలు భారతదేశానికి ఆదర్శమని, 4.34 కోట్ల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఈ సంఖ్య కొన్ని దేశాల జనాభా కంటే ఎక్కువ అన్నారు. భారతీయ యువత ఎక్కువ మంది ప్రపంచం వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని, వేల ఇంజినీరింగ్ విద్యాసంస్థలు రాష్ట్రంలో ఉన్నా యన్నారు. 1.5 మిలియన్ మంది దేశం నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారని, 90 శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. గ్రామీణ, కుటుంబ నేపథ్యం అనేది ముఖ్యం కాదు ఆలోచన సరళి ముఖ్యమన్నారు. ప్రపంచానికి భారత్ అవసరం ఉందని, తెలంగాణ రాష్ట్రంలో కాకతీయుల పేరుతో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయం గొప్పగొప్ప వ్యక్తులను అందించిందన్నారు. యూనివర్సిటీకి రావటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి,తెలంగాణ అకాడమీ అఫ్ సైన్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహనరావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం,హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కే. నందుకూరి ,డాక్టర్ కే.సుజాత తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, చేవెళ్ల పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గారి పుట్టినరోజు సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, నాయకులు సునీల్ పాల్గొన్నారు.

అమరావతి,ఆగస్టు-19

## సర్పంచుల, ఎంపీటీసీల, జడ్పీటీసీల సమస్యలు పరిష్కరించాలని





- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వై.వి.బి రాజేంద్రప్రసాద్

అమరావతి,ఆగస్టు-19: అమరావతిలోని సెక్రటేరియట్ నందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసిన అనంతరం రాజేంద్రప్రసాద్ మీడి యాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70 శాతం భూభాగంలో నివసిస్తున్న మూడున్నర కోట్ల గ్రామీణ ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఎదుర్కొంటున్న సమస్య లు గ్రామీణ ప్రజల గ్రామాల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసు కువెళ్లడం జరిగిందని రాజేంద్రప్రసాద్ తెలియజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్,రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిర్రుప్రతాపరెడ్డిలు ఉన్నారు.

## సమ్మె బాటలో.. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ కార్మికులు




- కార్మికుల కూలీ పెంచాలని పనులు బంద్
- కూలీపెంపుపై యాజమానుల వైఖరితో సమ్మె
- సీఐటీయు పవర్ లూం వర్కర్స్ యూనియాన్ జిల్లా అధ్యక్షుడు రమణ

సిరిసిల్లరూరల్,ఆగస్టు19 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్ టైల్ పార్కులోని కార్మికులు మంగళవారం సమ్మె బాట పట్టారు. టెక్స్ టైల్ పార్క్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రాలకు కూలీ పెంచాలని ఇటీవలే యాజమానులను కోరగా, యాజమానులు కూలీ పెంపుపై ఎటు తేల్చకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈ మేరకు మంగళవారం టెక్స్ టైల్ పార్క్ పవర్ లూం కార్మికుల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ ఆధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రాలకు యాజమానులు కూలీ పెంచే వరకు కార్మికులు పనుల్లోకి వెళ్లకూడదని తీర్మాణం చేశారు. అనంతరం పార్క్‌లోని క్యాంటీన్ నుంచి ప్రధాన గేట్ వరకు కార్మికులు ర్యాలీగా వెళ్లి, ప్రధాన గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, యాజమానులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం సీఐటీయు పవర్ లూం వర్కర్స్ యూనియన్ జిల్లా ఆధ్యక్షుడు కోడం రమణ మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్క్ కార్మికులు మెరుగైన ఉపాధి కోసం కూలీ పెంచాలని, ప్రభుత్వ వస్త్రాలకు రోజుకు రూ. వెయ్యి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆర్డర్లకు కార్మికుల కష్టానికి తగిన కూలీ చెల్లించకుండా కార్మికులను నష్టం చేసేలా వ్యహరిస్తున్నారని మండిపడ్డారు. కూలీ ఒప్పందం ముగిసిన ప్రైవేటు వస్త్రానికి కూడా 10 పిక్కులకు 50 పైసలు కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై యాజమానుల సంఘానికి 5 రోజుల క్రితమే నోటిస్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఎలాంటి చర్చలు జరపకుండా కార్మికులు కూలీ పెంపు పట్ల నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారన్నారు. దీంతోనే మంగళవారం నుంచి స్వచ్ఛందంగా పనులు బంద్ చేసి, సమ్మెలోకి వెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటికైనా యాజమానులు స్పందించి, కార్మికులకు కష్టానికి తగిన వేతనాలు వచ్చే విధంగా కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు కూడా స్పందించి, యాజమానులు కూలీ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల సమ్మె పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సదానందం, సంపత్, శ్రీనివాస్, కిషన్, శ్రీకాంత్, ఆంజనేయులు, రామచంద్రం, వేణు, వెంకటేశం, అంబదాస్, రమేష్, రాజు, మహేష్, జనార్దన్, గంగయ్య, శ్రీనివాస్, అశోక్, రామచంద్రం, వరప్రసాద్, గణేష్, మనోహర్, రాజశేఖర్, ప్రశాంత్, రాకేష్, రాజేశ్, మోహణ్, కార్మికులు ఉన్నారు.

# దూసుకొచ్చిన బుల్డోజర్లు..

## గోదావరిఖనిలో హైడ్రా తరహాలో కూల్చివేతలు..

గోదావరిఖని ఆగస్టు 19: గోదావరిఖని నగరం ఉలిక్కిపడింది. ఆపరేషన్ పోచమ్మ మైదాన్ క్లైమాక్స్ రణరంగంగా మారింది. నిశ్శబ్ద వాతావరణంలో ఒక్కసారిగా అలజడి రేగింది. బులడోజర్ ఒకటెనుక మరొకటి దూసుకొచ్చింది.. హైడ్రా తరహాలో వ్యాపారులు, ప్రజలు చూస్తుండగానే భవనాలను నేలమట్టం చేసింది.గోదావరిఖని నగరం నడిబొడ్డున మంగళవారం జరిగిన ఈ సంఘటన అందరిని భయకంపితులను చేసింది. ఒకవైపు పోలీస్ బలగాలు మరోవైపు బుల్డోజర్లు.. అసలు ఏం జరుగుతుందో తెలియని ఉద్రిక్త వాతావరణం మధ్య భారీ శబ్దాలతో భవనాలు ఒక్కసారిగా నేలమట్టం అయ్యాయి. ఈ ఘటనలు చూసేందుకు గోదావరిఖని నగరం పరిసర ప్రాంతాల నుంచి భారీగా జనాలు తరలి వచ్చారు. ఆందోళనకారులను గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు కట్టడి చేసేందుకు అష్ట కష్టాలు పడ్డారు. సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గోదావరిఖని నగరం ప్రధాన చౌరస్తాలోని రామగుండం నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా 39 గుంటల స్థలంలో ఉన్న వివాదాస్పద భవనాలు గా పేర్కొంటూ మంగళవారం సాయంత్రం రామగుండం నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు. ఆపరేషన్ పోచమ్మ మైదాన్ లో భాగంగా గతంలోనే పలు దుకాణాలను నగరపాలక సంస్థ, సింగరేణి సంస్థ అధికారులు సమన్వయంతో కూల్చివేశారు. మిగతా భవనాలను కూడా తొలగించేందుకు ప్రయత్నం కోర్టు పరిధిలో ఉండడంతో అక్కడితో ఆగిపోయారు.ఈ నేపథ్యంలో సోమవారం హైకోర్టు ఆదేశాలతో ఇక్కడి పోచమ్మ మైదాన్ లోని భవనాలను అధికారులు సర్వే చేశారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మళ్లీ అధికారులు రంగంలోకి దిగారు. షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్ని భవనాలను ప్రజలంతా చూస్తుండగానే కూల్చివేత చర్యలు చేపట్టారు. దాదాపు 6 జెసిబి వాహనాలను రంగంలోకి దింపారు. అప్పటిదాకా దుకాణాలలో ఉన్న వ్యాపారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా గోదావరిఖని వన్ టౌన్



పోలీసులు భారీగా మోహరించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దుకాణాలలో ఉన్న సామాగ్రిని సంబంధిత వ్యాపారులు బయటకు తీసుకు వెళుతుండగానే మరోవైపు జెసిబి లతో భవనాలను కూల్చి వేశారు. ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండానే భవనాలను తొలగిస్తుండడంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు 20 కి పైచిలుకు భవనాలను కూల్చివేసేందుకు రంగంలోకి దిగారు. ఈ కూల్చివేతలు బుధవారం ఉదయం వరకు కూడా కొనసాగే అవకాశం ఉంది. ఉద్రిక్తత పరిస్థితుల మధ్య కూల్చివేత చర్యలతో అటు వ్యాపారులు.. ఇటు నగర ప్రజలు హడలెత్తిపోయారు. ఈ చర్యలతో నగర చౌరస్తాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.

## తప్పని యూరియా కష్టాలు.. వర్షంలోనూ రైతుల ధర్నా

రాయపోల్, ఆగస్టు 19 : సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో రైతులకు యూరియా పంపిణీ చేయడంలో వ్యవసాయ అధికారులు విపుల మయ్యారని రైతులు ఆగ్రహించారు. యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేస్తూ దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం శివాజీ చౌరస్తా వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ అధికారి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. యూరియాను అందుబాటులో ఉంచడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని రైతులు మండిపడ్డారు. వర్షాలు కురుస్తున్న సమయంలో యూరియా తగినంత రైతులకు అందించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. మనిషికి రెండు బస్తాల యూరియాను అందించి చేతులు దులుపుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు రెండు బస్తాల యూరియా కోసం షాపుల వద్ద క్యూలైన్ కట్టి పనులు వదులుకొని యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు..మండలానికి యూరియా ఎంత వస్తుంది రైతులకు ఎంత పంపిణీ చేస్తున్నారని పర్యవేక్షణ కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులకు ఒకసారి మండలానికి యూరియా వస్తే ప్రైవేటు దుకాణదారులు 300 నుండి 350 రూపాయల వరకు అమ్ముతున్నప్పటికీ పలుమార్లు ఫిర్యాదు చేసినా వ్యవసాయ అధికారి పట్టించుకోవడం లేదన్నారు. వచ్చిన యూరియా అందరికి సమానంగా ఇవ్వాల్సింది పోయి ఫర్టిలైజర్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తూ యూరియా అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు.ప్రైవేట్ ఫర్టిలైజర్ షాప్‌లో అధిక ధరలకు యూరియాను అందిస్తున్నారని, దీనిని అరికట్టడంలో స్థానిక వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల రైతులు వ్యవసాయ శాఖ అధికారులపై ఆగ్రహం చెందారు. రైతుకు సరిపడా





యూరియాను అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.యూరియా కోసం రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకొని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ అక్కడికి వెళ్లి రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. రైతులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి గమనించిన పోలీసులు అక్కడకు చేరుకొని వ్యవసాయాధికారులతో మాట్లాడి రైతులకు సముదాయించి యూరి యా అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## రాష్ట్రవ్యాప్తంగా వాటిని తక్షణమే తొలగించాలి..

### తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

ఇటీవల హైదరాబాద్ లోని రామాంతపూర్ లో జరిగిన ఘటన యావత్ రాష్ట్రాన్ని షాక్ కు గురిచేసింది. రామంతపూర్ లోని గోఖలేనగర్ లో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో రథానికి విద్యుత్ తీగలు తగిలిన ఘటన ఐదుగురు మృతి చెందారు. రథాన్ని లాగుతున్న సమయంలో విద్యుత్ తీగలు తగిలి నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. అయితే మృతుల కుటుంబాలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల నష్టపరిహారం కూడా ప్రకటించింది. అయితే రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తక్షణమే తొలగించాలని విద్యుత్ శాఖకు సూచించారు. ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కేబుల్ ఆపరేటర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని భట్టి విక్రమార్క మండి పడ్డారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విద్యుదాఘాతం కారణంగా పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. వర్షాల కారణంగా విద్యుత్ తీగలు తగిలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల రామంతపూర్ లో విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు మృతి చెందారు. ఈ ఘటన మరువక ముందే పాతబస్తీలోని బండ్లగూడ రోడ్డు వద్ద వినాయకుడి విగ్రహాన్ని మండపానికి తీసుకెళ్తుండగా.. విద్యుత్ షాక్ తగిలి మరో ఇద్దరు మృతి చెందారు. ఇలా వరుస ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న కరెంట్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని ఈ మేరకు విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ కనెక్షన్లు పొందుతున్న వారినిగుర్తించి వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్నారు.

## రికార్డులు తిరగరాస్తున్న పీ4- 13 లక్షల కుటుంబాల దత్తత-

### చంద్రబాబు వాటా 250..!

అమరావతి-ఆగస్టు-19 : ఏపీలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. పేదల్ని దత్తత తీసుకునేందుకు ముందుకొస్తున్న మార్గదర్శుల్ని గుర్తించడంతో పాటు వారికి కనీస సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటివరకూ పీ4లో 13.4 లక్షల కుటుంబాల్ని 1.4 లక్షల మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఇందులో సీఎం చంద్రబాబు ఒక్కరే 250 కుటుంబాల్ని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రతి నిర్ణయమూ పేదలను దృష్టిలో పెట్టుకునే ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం అమలును సీఎం చంద్రబాబు ఇవాళ లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఉగాది రోజు ప్రారంభమైన పీ4 కార్యక్రమంలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. దీనిపై స్పందించిన సీఎం.. పేదరిక నిర్మూలన ఎన్టీఆర్ సిద్ధాంతం. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని భావించే సిద్ధాంతాన్ని బలంగా నమ్మి పరిపాలన చేస్తున్నామని తెలిపారు. అందుకే ప్రతినిత్యం పేదల కోసమే ఆలోచన చేస్తున్నాం. పేదల అభ్యున్నతికే నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. . ఆర్థిక సంస్కరణలతో సంపద వచ్చింది. ఇప్పుడు సమాజంలో అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయని, సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా, పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నట్లు వెల్లడించారు. ఇటీవలే ఓ అజ్ఞాత భక్తుడు తాను స్థాపించిన కంపెనీ ద్వారా వచ్చిన సంపాదన నుంచి రూ.140 కోట్ల విలువైన 121 కేజీల బంగారాన్ని తిరుమల వెంకన్నకు ఇచ్చారని ఇంత భారీ ఎత్తున విరాళం ఇచ్చినా తన పేరు బయటకు తీసుకురావద్దని కోరారని, ఇలా కొంత మంది తమకు తోచిన రీతిలో సేవ కార్యక్రమాలు చేస్తూ ఉంటారన్నారు. తాను కూడా మార్గదర్శినేనని, కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## సోషల్ పోస్టులపై ఏపీ సర్కార్ కొరడా..!

### త్వరలో చట్టం, నిజ నిర్ధారణ కమిటీ..!



అమరావతి-ఆగస్టు-19 : ఏపీలో రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న పోరుకు సోషల్ మీడియా కేంద్రంగా మారుతోంది. అధికారంలో ఉన్న పార్టీలకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాల్ని తెరపైకి తీసుకురావడం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉంది. ఇప్పుడు అలాంటి సోషల్ ప్రచారాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. అలాగే ప్రజలకు వాస్తవాలు తెలిసేందుకు ఓ నిజ నిర్ధారణ కమిటీని కూడా ఏర్పాటు చేస్తోంది. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని, దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తెస్తామని హోంమంత్రి అనిత ప్రకటించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా భావానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టం తెస్తామన్నారు. దీంతో పాటు ప్రత్యేకంగా ఒక నిజ నిర్ధారణ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసి వాస్తవాలేమిటో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తుం దని హోంమంత్రి అనిత ప్రకటించారు. అమరావతి మునిగిపోయిం దని విజయవాడ ప్రకాశం బ్యారేజి గేట్లు పనిచేయడం లేదని పలు అసత్య ప్రచారాలను సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రసారం చేస్తూ ప్రభుత్వంపై మూకుమ్మడి దాడి చేస్తున్నారని, ఇకపై అలాంటి తప్పుడు వార్తల ప్రసారాలను సమర్ధవంతంగా తిప్పకొట్టడంతోపాటు అందుకు కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు అనిత తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంగా అమలు చేయడంతో ప్రతిపక్షపార్టీ తట్టులేక పోతోందని అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని చేస్తోందని హోం మంత్రి అనిత మండిపడ్డారు. ఇది ఆపార్టీకి వారసత్వంగా వచ్చిన సమస్యగా ఉందన్నారు. ఒక్క ఆగష్టు నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నేతన్నలకు,నాయి బ్రాహ్మణులకు 200 వరకూ ఉచిత విద్యుత్,స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామన్నారు. అసాంఘిక శక్తులను ఎలా అరికట్టాలో చంద్రబాబుకు బాగా తెలుసని అలాంటి శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

## ఉప్పొంగిన మంజీర..

- ఆరు రోజులుగా జలదిగ్బంధంలో ఏడుపాయల వనదుర్గ ఆలయం..



ఏడుపాయల: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయటంతో మంజీరానది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. దీంతో మెదక్ జిల్లా ఏడుపాయల ఆలయంలోని వనదుర్గ ఆనకట్ట వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. భారీ వరదతో ఆరు రోజులుగా ఏడుపాయల ఆలయం జలదిగ్బంధంలోనే ఉన్నది. గర్భగుడి ముందున్న నదీపాయ అమ్మవారి పాదాలను తాకుతూ రాజగోపురం ముందు నుంచి నీరు ప్రవహిస్తున్నది. దీంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట వైపు, గర్భగుడి వైపు భక్తులు వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.

## మండలంలో సోమవారం భారీ వర్షం



నార్నూర్ : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ , గాదిగూడ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. నార్నూర్ నుంచి గాదిగూడ వెళ్లే ప్రధాన రహదారి ఖడ్కి, లోకరికే, ధాబాకే కల్వర్టులపై వరద ప్రవాహంతో ప్రయాణికులు, వాహన చోదకులు వరద నీరు తగ్గే వరకు నిరీక్షించాల్సి వచ్చింది. వాగులు వంకలు జలమయ్య మయ్యాయి.పంట పొలాలలో భారీ వర్షపు నీరు చేరడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసుల శాఖల అధికారులు కోరారు. గడిచిన 24 గంటల్లో ఇంద్రవెల్లిలో46.4 మి.మీ , ఉట్నూర్‌లో 48.2 మి. మీ, నార్నూర్‌లో 40.0 మి.మీ, గాదిగూడలో 52.88 మి.మీ వర్షపాతం నమోదయింది.

## అదరహో అనిపిస్తున్న శ్రీశైలం జలాశయం అందాలు..

- విద్యుద్దీపాల వెలుగులో డ్యామ్ అందాలు





### చూడాల్సిందే..

శ్రీశైలం : శ్రీశైలం డ్యామ్ జలాశయం సరికొత్త శోభను సంతరించుకున్నది. పగటి వేళలో నీటి గర్జనతో చేయగా.. రాత్రి సమయంలో శ్రీశైలం డ్యామ్ అందాలు అదరహో అనిపిస్తున్నాయి. విద్యుద్దీపాల వెలుగులతో అద్భుతంగా ప్రకాశించిపోతుంది. శ్రీశైలం డ్యామ్ క్రస్ట్ గేట్ల నుంచి వస్తున్న కృష్ణమ్మ జలాలు, జాతీయ పతాకం రంగుల కాంతులతో నిండిపోయి.. ఆ ప్రాంతాన్ని ప్రకాశవంతంగా మార్చేశాయి.కాషాయ, తెలుపు, ఆకుపచ్చతో పాటు తదితర రంగులు జలాలపై ప్రతిబింబించి, ఒక అద్భుతమైన దృశ్యం ఏర్పడింది. ఇది చూసి పర్యాటకులు మంత్ర ముగ్ధులవుతున్నారు.

## ప్రభుత్వం, అధికారుల బాధ్యతరాహిత్యంతోనే ఆరుగురి మృతి : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, ఆగస్టు-19: ప్రభుత్వం, అధికారుల బాధ్యత రాహిత్యంతోనే రామాంతపూర్‌లో ఆరుగురి మృతి చెందారనిమాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విద్యుత్ షాక్ ఘటన జరిగిన రామంతపూర్‌లో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ హబ్సిగూడ, ఓల్డ్ రామం తపూర్‌లలో మృతుల కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్ ఉన్న యువకుల మృతి చాలా బాధాకరం అన్నారు. అధికారులకు ఎన్ని సార్లు పిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన తర్వాత ఆఘమేఘాల మీద విద్యుత్ తీగలను మార్చారన్నారు. ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు.

# ప్రధానిని కలిసి శుభాన్షు శుక్లా.. అభినందించిన మోదీ



హైదరాబాద్, ఆగస్టు-19: ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి చరిత్ర సృష్టించిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా తన అంతరిక్షయానం గురించి ప్రధానికి వివరిం చారు. మోదీ శుక్లాను ఆలింగనం చేసుకొని అభినందించారు. ఆయన సాధించిన విజయాన్ని ప్రశంసించారు. అనంతరం శుక్లా తన అంతరిక్ష ప్రయాణం, అనుభవాలను మోదీకి చెప్పారు. శుక్లా ఆదివారం భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్య మంత్రి రేఖ గుప్తా, ఇస్రో చీఫ్ వీ నారాయణన్ సహా పెద్ద సంఖ్యలో జనం శుభాన్షు శుక్లాకు స్వాగతం తెలిపేందుకు వచ్చారు. శుక్లా భార్య కామ్నా, కుమారుడు కియాష్ సైతం విమానాశ్రయానికి వచ్చారు. దాదాపు ఏడాది తర్వాత శుభాన్షు భారత్‌కు వచ్చాడు. ఐఎస్ఎస్‌ఐకు వెళ్లేందుకు అమెరికా లోనే దాదాపు ఏడాది పాటు శిక్షణ పొందాడు. ఆక్సియం-4 మిషన్‌కు బ్యాకప్‌గా ఎంపికైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ సైతం శుభాన్షుతో కలిసి స్వదేశానికి చేరుకున్నాడు. శుభాన్షు సోమవారం ప్రధానిని మోదీని కలువగా.. ఆ తర్వాత తన స్వస్థలం లక్నోకు వెళ్లనున్నారు. ఆగస్టు 22-23 తేదీల్లో జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఢిల్లీకి చేరుకుంటారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ చేసింది. శుభాన్షు భారతదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఈ చర్చను చేపట్టింది. లోక్‌సభలో జరగనున్న చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడారు 2047 నాటికి చంద్రుడిపై కాలు మోపి.. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తామ న్నారు. ఇదిలా ఉండగా.. ఆక్సియం మిషన్‌ల భాగంగా శుక్లా జూన్ 235న ఫ్లోరిడా నుంచి బయలుదేరి.. జులై 15న భూమికి తిరిగి వచ్చాడు. మరో ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోజ్ (పోలాండ్), టిబోర్ కాపు (హంగేరీ)లతో కలిసి 18 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. మిషన్‌లో శుభాన్షు 60కి పైగా ప్రయోగాలు, 20 ఔట్రీచ్ సెషన్‌లను నిర్వహించారు.

# హైలెవెల్ వంతెనలు ఏర్పాటు చేయాలని ఆదివాసీల నిరసన దీక్షలు



తాండూర్ : మండలంలోని గిరిజన గ్రామాల పరిధిలో హైలెవెల్ వంతెనలు, రోడ్ డ్యాంలు నిర్మించాలని ఆదివాసీ సంఘం నాయకులు సోమవారం తాండూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షుడు కుర్సెంగ బాబురావు మాట్లాడారు.సింగరేణి చెక్‌పోస్టు నుంచి నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో భీమన్న వాగుపై హైలెవెల్ బ్రిడ్జి, లచ్చుగూడ వద్ద మరో బ్రిడ్జి నిర్మించాలని కోరారు. వర్షాల వల్ల దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లు బాగు చేయాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చిన రోజు తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేయడం వల్ల ఆదివాసీ ప్రజానీకానికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోయం సురేష్, నైతం సోము, ఎల్ముల శ్రీను, సోయం పర్వత్, రావు, తుమ్రం జంగు, కుర్సెంగ లచ్చు, తొడసం జోగు, పోయం మోతీరాం, తుడుందెబ్బ, రాయ్ సెంటర్, నాయక్పోడ్, కొలాం, కొలవార్, తోటి అనుబంధ సంఘాల ఆదివాసీలు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో విషాదం.

- రథానికి కరెంటు తీగలు తగిలి ఐదుగురు మృతి



హైదరాబాద్, ఆగస్టు-18: హైదరాబాద్ రామంతాపూర్‌లో అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీకృష్ణా ష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణాష్టమి సందర్భంగా రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో రథాన్ని లాగుతున్న వాహనం బ్రేక్ డౌన్ అయింది. దానిని పక్కన నిలిపివేసిన యువకులు.. రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. దానికి కరెంటు తీగలు తగలడంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి షాక్ కొట్టింది. దీంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లుగా దూరంగా పడిపోయారు. వారిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది.మరో నలుగురిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వారిని కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి (35), రుద్రవికాస్ (39), రాజేంద్రరెడ్డి (45)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ కూడా ఉన్నట్లు తెలుస్తున్నది.

# రూ.కోట్ల వ్యయం..లక్ష్యానికి దూరం

- మేడ్చల్‌లో ప్రారంభానికి నోచుకోని మత్స్య కళాశాల
- మూడేళ్ల కిందటే భవనాలు పూర్తి
- పట్టించుకోని మత్స్య శాఖ అధికారులు, సర్కార్



మేడ్చల్, ఆగస్టు 17: రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. ఐదేళ్ల కిందట పనులు ప్రారంభించి, మూడేళ్ల కిం దట పూర్తిచేసిన భవనాలను వినియోగంలోకి తీసుకురావడంతో అధికా రులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పరిస్థితి ఇంకొన్నాళ్లు ఇలాగే కొనసాగితే ఆయా భవనాలు శిథిలమై, ప్రజాధనం బూడిదిలో పోసిన పన్నీరయ్యే అవకాశం ఉంది. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ పట్టణం 44వ జాతీయ రహదారికి ఆనుకొని హైదరాబాద్-మేడ్చల్ దారిలో మత్స్యశాఖకు ఐదెకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో గతంలో అలంకరణ, ఆహార చేపల కేంద్రాన్ని నిర్వహించేవారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులకు పెద్దపీట వేయడంతో చేపల కేంద్రాన్ని మత్స్య కళాశాలగా మార్చాలని సంకల్పించింది. ఈ మేరకు నిధులు కూడా విడుదల చేసింది. రూ.5.55 కోట్లతో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ మూడేళ్ల కిందటే మత్స్య కళాశాలకు భవనాలను నిర్మించి, శాఖకు అప్పగించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మేడ్చల్‌లోని మత్స్య కళాశాల భవనం, ఆక్వా కోర్సులను ప్రారంభించేం దుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారా యి అక్వారంగ కోర్సులకు మెరుగైన ఉపాధి..దేశంలో అక్వా కల్చర్ రోజు రోజుకు విస్తరిస్తోంది. చేపల, రొయ్యల ఉత్పత్తి రంగంలో ఉపాధి అవకా శాలు మెండుగా ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం మేడ్చల్‌లో మత్స్య కళాశాల భవనం నిర్మించింది. రాష్ట్రంలో ఇలాంటి కళా శాలలు, శిక్షణా కేంద్రాలు అతి తక్కువగా ఉన్నాయి. చేపల రంగానికి సంబంధించి డిప్లమా, డిగ్రీ, పీజీ కోర్సును పూర్తిచేస్తే అక్వా రంగంలో మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉన్నాయి. మేడ్చల్‌లో మత్స్య శాఖ కళాశాల అందుబాటులోకి వస్తే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు పరిసర జిల్లాల విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. మత్స్య కళాశాల నిర్వహణకు భవనాలు నిర్మించిన చోట ఐదెకరాల స్థలం ఉన్నప్పటికీ వరద నీరు భారీగా నిల్వ ఉంటుంది. జాతీయ రహదారి విస్తరణలో డ్రైన్ నిర్మించని కారణంగా ఇక్కడ వరద నీళ్లు నిల్వ ఉంటున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా కుంటలా కన్పిస్తుంది. కుంట పూడ్చివేత, లోపల రోడ్ల నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించారు. పనుల నిర్వహణ ఇంకా టెండర్ వరకు కూడా వెళ్లనట్టు తెలిసింది. ఇటీవల మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల, టీజీఎఫ్‌సీవోఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మేడ్చల్ మత్స్య శాఖ కళాశాల భవనాలను జిల్లా మత్స్య శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. కళాశాల విషయమై చర్చించినట్టు సమాచారం.

### కబ్జాకు గురవుతున్న స్థలం..

పరిస్థితిఇలాగే కొనసాగితే భవనాలు శిథిలావస్థకు చేరుకుంటాయి. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కొద్ది కొద్దిగా కబ్జాకు గురయ్యే అవకాశం కూడా లేకపోలేదు. ఇప్పటికే కొంత భూమి కబ్జాకు గురైనట్టు స్థానికంగా టాక్. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే మత్స్య కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కూకట్‌పల్లి దారుణం..12 ఏండ్ల బాలికను హత్య చేసిన దుండగులు



హైదరాబాద్ : కూకట్‌పల్లిలో దారుణం చోటు చేసుకుంది. పన్నెండేండ్ల బాలికను గుర్తు తెలియని తుండగులు హతమార్చారు.ఈ విషాదకర సంఘటన కూకట్ పల్లిలోని సంగీత్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాలిక సహస్ర తల్లిదండ్రులు ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కాగా, సహస్ర ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని దుండగలు ఇంట్లోకి చొరబడిని బాలికను హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రామంతాపూర్ ఘటనలో ఆరుకు చేరిన మృతులు



హైదరాబాద్, ఆగస్టు-19: రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుల ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం రాత్రి రామంతాపూర్‌లోని గోకులేనగర్‌లో ఆదివారం రాత్రి రథయాత్ర నిర్వహించారు.ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగలడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతించెం దారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉస్మానియా దవాఖా నలో చికిత్స పొందుతున్న గణేశ్ అనే వ్యక్తి పరిస్థితి విషమించడంతో మరణించారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు పెరిగింది. మిగిలిన ముగ్గురి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఘటనా స్థలంలోనే కృష్ణ యాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి (35), రుద్రవికాస్ (39), రాజేంద్రరెడ్డి (45) మరణించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ కూడా ఉన్నారు.

రామంతాపూర్‌లో ఉద్రిక్తత..రామంతాపూర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు, వారికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన విద్యుత్ శాఖ సీఎండీని బాధితులు, స్థానికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు.ప్రమాదంలోచనిపోయినఆరుకుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకుదిగారు.ప్రతి కుటుంబానికి రూ. కోటి చొప్పున నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంఇవ్వాలనిడిమాండ్‌చేస్తున్నారు.అక్కడ పోలీసులు మోహరించారు.

## నేడు, రేపు ఎప్‌సెట్ ఇంటర్నల్ స్లైడింగ్



హైదరాబాద్, ఆగస్టు 19 : టీజీ ఎప్‌సెట్ సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లైడింగ్ షెడ్యూల్ విడుదలయ్యింది. సోమ, మంగళవారాల్లో విద్యార్థులు ఇంటర్నల్ స్లైడింగ్ వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 19న వెబ్ ఆప్షన్లను ఫ్రీజ్ చేస్తారు. 22న సీట్లు కేటాయిస్తారు.సీట్లు పొందిన వారు 22, 23న కాలేజీలో రిపోర్టుచేయాల్సి ఉంటు ంది. ఇంజినీరింగ్‌లో సీటు వచ్చిన విద్యార్థులు అదే కాలేజీలో మరో బ్రాంచీలో సీటు ఖాళీగా ఉంటే, ఆయా సీటు కావాలనుకుంటే ఈ ఇంటర్నల్ ట్కస్లైడింగ్‌లో పాల్గొనవచ్చు. ఇలా సీటు మార్చుకున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.




## ‘అఖండ 2’ ఓటీటీ రైట్స్ కోసం సాలిడ్ పోటీ.. మామూలుగా లేదట..!

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ చిత్రం ‘అఖండ 2’ శరవేగంగా తెరకెక్కుతోంది. మాస్ చిత్రాల స్పెషలిస్ట్ బోయపాటి శ్రీను ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఇక ఈ సినిమాను ఎప్పుడె ప్పుడు రిలీజ్ చేస్తారా అని అభిమానులు ఆశగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ రైట్స్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను దక్కించుకునేందుకు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియోలు భారీ ధర కోట్ చేస్తున్నాయట. అయితే, జియో హాట్‌స్టార్ ఈ రెండు ప్లాట్‌ఫామ్‌లకంటే కూడా ఎక్కువ మొత్తంలో కోట్ చేసిందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.దీంతో ఈ చిత్ర ఓటీటీ రైట్స్‌ను దక్కించుకు నేందుకు జియో హాట్‌స్టార్ గట్టిగా ప్లాన్ చేస్తుందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఆది పినిశెట్టి, సంయుక్తా మీనన్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.




# ఓటీటీలోకి ‘హరిహర వీరమల్లు’.. ఈ రాత్రి నుంచే స్ట్రీమింగ్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు మూవీ జులై 24 ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. కానీ రిలీజ్ రోజు నుంచే ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అట్టర్ ఫ్లాఫ్ గా నిలిచింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేక పోయింది. దీంతో ఈ మూవీతో బిజినెస్ చేసినవాళ్లు భారీ నష్టాల్ని చవిచూశారు. సుదీర్ఘ విరామం తర్వాత పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం కావడంతో ఫ్యాన్స్ తోపాటు తెలుగు సినీ అభిమానులు ఈ మూవీపై ఆసక్తిగా ఎదురుచూశారు. పవన్ కెరీర్ లో నటించిన తొలి పీరియాడిక్ మూవీ ఇదే కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి. కానీ మొదటి షో నుంచే మూవీకి నెగెటివ్ టాక్ వచ్చింది. దీంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచింది. అయితే ఈ మూవీ తాజాగా ఓటీటీ లోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 20 నుంచి ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది. దీంతో విడుదలైన నెల రోజుల్లోపే ఈ మూవీ ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ మూవీకి టాలీవుడ్ డైరెక్టర్లు క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించారు. నిధి అగర్వాల్ కీలక పాత్రలో నటించింది. ఈ మూవీని మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏఎం రత్నం నిర్మించారు. ఇక బాలీవుడ్ స్టార్ యాక్టర్ బాబీ డియోల్ కీలక పాత్ర పోషించారు. నర్గిస్ ఫక్రీ, నోరా ఫతేహి తదితరులు మూవీలో నటించారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందించారు.



## ‘వార్ 2’ పై ఎన్టీఆర్ మౌనం వీడేనా..?

బాలీవుడ్ ప్రెస్టీజియస్ బ్యానర్ యష్ రాజ్ ఫిల్మ్స్ నుంచి వచ్చిన క్రేజీ చిత్రం ‘వార్ 2’ ఇటీవల రిలీజ్ అయ్యి బాక్సాఫీస్ దగ్గర సం దడి చేస్తుంది. ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటించడంతో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూశారు. కానీ, ఈ సినిమా రిలీజ్ తర్వాత ఇందులోని కంటెంట్ ప్రేక్షకులకు పెద్దగా ఎక్కలేదు.దీంతో ఈ సినిమా ఫ్లాప్ దిశగా వెళ్తోంది. అయితే, ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఎన్టీఆర్ సక్సెస్ ట్రాక్ రికార్డును ఈ సినిమా బ్రేక్ చేయడంతో అభిమానులు నిరాశకు లోనవుతున్నారు. అయితే, ఈ సినిమాపై ఎన్టీఆర్ అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడేలా ప్రమోషన్స్ చేసినా, ఎందుకో వారికి ఈ సినిమా కనెక్ట్ కాలేదు. మరి ఈ సినిమా ఫెయిల్యూర్ దిశగా వెళ్తున్న తరుణంలో ఎన్టీఆర్ ఏదైనా రెస్పాండ్ అవుతాడా అనేది ఆసక్తికరంగా మారింది. ఇకపై ఎన్టీఆర్ కంటెంట్, పాత్రలపై మరింత ఫోకస్ పెట్టాలని వారు కోరుతున్నారు.

# ఉన్నది ఉన్నట్టు చెప్పడంలో హీరోయిన్ స్వరా భాస్కర్ తర్వాతే ఎవరైనా



ఉన్నది ఉన్నట్టు చెప్పడంలో హీరోయిన్ స్వరా భాస్కర్ తర్వాతే ఎవరైనా... ఆమె కేవలం ఒక నటిగానే కాకుండా, తన గొంతుకను బలంగా వినిపించే సామాజిక కార్యకర్తగా కూడా గుర్తిం పు దక్కించుకున్నారు.’తను వెడ్స్ మను’ ,’రాంఝణా’ ,’ప్రేమ్ రతన్ ధన్ పాయో’,’నీల్ బట్టే సన్నాట’ ,’వీరే ది వెడ్డింగ్’ వంటి సూపర్ హిట్ సినిమాల్లో స్వరా భాస్కర్ నటించింది. స్వరా భాస్కర్ వైవాహిక జీవితంతో కూడా వార్తల్లో నిలిచింది. ఆమె 2023లో సమాజ్ వాదీ పార్టీ నాయకుడు ఫహాద్ అహ్మద్‌ను వివాహం చేసుకున్నారు. ఈ వివాహం సాంప్ర దాయబద్ధంగా కాకుండా, కోర్టు వివాహంగా జరిగింది. సినీ పరిశ్రమతో పాటు, స్వరా భాస్కర్ సామాజిక ,రాజకీయ అంశాలపై చాలా యాక్టివ్‌గా ఉంటారు. ఆమె మహిళా హక్కులు, లౌకికవాదం ,రాజకీయ సమాన త్వం వంటి అం శాలపై తన అభిప్రాయాలను నిర్భయంగా తెలియజేస్తుం టారు. తన నిర్భయత్వం మరియు అభ్యుదయ భావాలతో ఆమె ఎందరికో స్ఫూర్తినిచ్చారు. స్వరా భాస్కర్ తాజాగా మానవ లైంగిక గుర్తింపు (సెక్సువల్ ఐడెంటిటీ) గురించి గురించి చేసిన కామెంట్స్ సంచలనం సృష్టించాయి. దీనిపై ఆమె మాట్లా డుతూ.. నిజానికి ప్రతి ఒక్కరూ బైసెక్సువలే అని, ప్రతి మనిషి అబ్బాయి, అమ్మాయి ఇద్దరి పట్ల ఆకర్షితులు అవుతారని ఆమె అభిప్రా యప డ్డారు. ఈ విషయాన్ని మరింత స్పష్టం చేస్తూ, తనకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమం త్రి అఖిలేష్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ పట్ల “క్రష్” ఉందని ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు స్వరా భాస్కర్‌ను తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. స్వర భాస్కర్ చేసిన ఈ వ్యాఖ్యలకు ఆమె భర్త, అఖిలేష్ యాదవ్ ఎంత బాధపడి ఉంటారో అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు ఆమె గతంలో నటించిన కొన్ని సినిమాలను ప్రస్తావిస్తూ..సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా ఇలాగే ఉంటారా? అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. స్వరా భాస్కర్ క్రష్ అని చెప్పిన డింపుల్ యాదవ్, రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటారు. ఆమె తన వాగ్దానాలను నిలబెట్టుకుంటూ ప్రజల మధ్య మంచి పేరు సంపాదించుకున్నారు. ముఖ్యమంత్రి భార్యగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా డింపుల్ యాదవ్ ప్రజలకు సేవలందించారు. ఈ వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో డింపుల్ యాదవ్ ఎలా స్పందిస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# విశ్వంభర రిలీజ్ డేట్‌పై కొత్త వార్త.. ఇదైనా ఫైనల్ అవుతుందా..?

మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటెస్ట్ చిత్రం ‘విశ్వంభర’ ఎప్పుడో రిలీజ్ కావాల్సింది. కానీ, అనేక కారణాల వల్ల ఈ సినిమా వాయిదా పడుతూ వచ్చింది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రంగా ‘విశ్వంభర’ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుంది. ఇక ఈ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ ఇవ్వడం ఖాయమని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.అయితే, ఈ సినిమాకు సంబంధిం చిన రిలీజ్ డేట్ విషయంలో కొత్త తేదీని మేక ర్స్ పరిశీలిస్తున్నారట. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా రిలీజ్ చేస్తే మంచి రన్ కొనసాగిస్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇందులోని కంటెం ట్, వీఎఫ్ఎక్స్ ప్రేక్షకులను మెప్పించడం ఖాయమని వారు చెబుతున్నారు. మరి ఈసారైనా ఈ మూవీ రిలీజ్ డేట్ ఫిక్స్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.

## దృశ్యకావ్యంగా శశివదనే

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా రూపొందుతున్న ఫీల్‌గుడ్ విం టేజ్ విలేజ్ లవ్‌స్టోరీ ‘శశివదనే’. సాయిమోహన్ ఉబ్బన దర్శకుడు. అహి తేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోదాల నిర్మాతలు. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. ఈ సందర్భంగా సోమవారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. అక్టోబర్ 10న సినిమా విడుదల కానుం ది.ఓ దృశ్యకావ్యంగా ఈ సినిమాను రూపొందించామని, అనుదీప్‌దేవ్ అం దించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన బలమని, విజువ ల్‌గా కూ డా సినిమా అద్భుతంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. శ్రీమా న్, దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ తదితరులు ఇతర పాత్రలు పోషిం



చిన ఈ చిత్రానికి కెమెరా: శ్రీసాయికుమార్ దారా, సమర్పణ: గౌరీనాయుడు, నిర్మాణం: ఏజీ ఫిల్మ్ కంపెనీ.